ఆదివారం
23-6-2024

# ముందడుగు

సంపుటి: 1, సంచిక: 373, పేజీలు: 4 | ₹6
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD
EPAPER.MUNDADUGU.COM
దినపత్రిక

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




## నీట్ పరీక్ష రద్దు చేయకపోవడానికి కారణమిదే

కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ

ముందడుగు జాతీయం:
దేశంలో నీట్ యూజీ పరీక్ష వివాదాస్పదంగా మారింది. నీట్ పరీక్ష సందర్భంగా తగినంత సమయం ఇవ్వలేదనే కారణంతో కొందరు విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడం, ఆ తర్వాత వారి ర్యాంకులు అనూహ్యంగా మారిపోవడం వంటి కారణాలతో పేపర్ లీక్ అనుమానాలు తలెత్తాయి. దీనిపై సుప్రీంకోర్టులో మిగతా 2లో

# పనిలో చంద్రబాబుతోనే పోటీ

రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు..!! ■ మేము 18 గంటలు పని చేస్తాం





ముందడుగు హైదరాబాద్:
ప్రస్తుతం చంద్రబాబుతో అభివృద్ధి లో పోటీ పడే అవకాశం తనకు వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబు గురించి ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగంలో సాధించలేనిది ఏమీ లేదన్నారు. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటుతో దేశంలో సంకీర్ణ రాజకీయాలకు పునాది వేశారన్నారు. హెల్త్ టూరిజం హబ్ లో బస్వతారకం ఆస్పత్రికి స్థలం కేటాయిస్తామని నందమూరి బాలయ్య కు రేవంత్ హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 25వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. నందమూరి బాలకృష్ణ తిరిగి 25 వార్షికోత్సవంకు రావాలని కోరుతున్నారని.. 30వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని చెప్పుకొచ్చారు. ఆస్పత్రి లీజ్ వివాదాన్ని క్యాబినేట్ నిర్ణయం తీసుకుని పరిష్కరించామని చెప్పారు. భవిష్యత్తులో బసవతారకం ఆస్పత్రికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో చంద్రబాబు గురించి రేవంత్ ప్రస్తావన చేసారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి పోటీగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమం వైపు పరుగులు పెట్టించాల్సిన అవసరం ఉందన్నారు..

తాను ఇదే విషయాన్ని తమ అధికారులకు సూచించినట్లు రేవంత్ వెల్లడించారు. గతంలో మిగతా 2లో



### మహిళపై వీధి కుక్కల గుంపు దాడి

వివరాలు 2లో




### యూట్యూబ్‌లో సరికొత్త నిబంధనలు

వివరాలు 3లో



### మనిషికి అధిక కొలెస్ట్రాల్ ప్రాణాంతకమే

వివరాలు 4లో




### ఆమె పెళ్లికి వెళ్లాల్సిన బాధ్యత నాకుంది

వివరాలు 5లో

## అమర్‌నాథ్ గుహలో మొదటి పూజ పూర్తి

■ ఈ ఏడాది జూన్ 29 నుంచి యాత్ర ప్రారంభం
■ ఆగస్టు 19న శ్రావణి పూర్ణిమతో ముగుస్తుంది



ముందడుగు జాతీయం:
హిందువుల ప్రధాన పుణ్యక్షేత్రాలలో ఒకటైన అమర్‌నాథ్ గుహలో శనివారం 'మొదటి పూజ' జరిగింది. శ్రీ అమర్‌నాథ్‌జీ పుణ్యక్షేత్రం బోర్డు చైర్మన్, జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మిగతా 2లో



## చిన్నారికి జీవిత కాల ఫ్రీ బస్ పాస్ ఇచ్చిన ఆర్టీసీ

■ బస్ పాసుతో పాటు రూ.14 వేల ఆర్థిక సాయం వస్త్రాలు
■ ట్విట్టర్ వేదికగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అభినందనలు

ముందడుగు కరీంనగర్:
కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలో జూన్ 16 ఆదివారం రోజున చిన్నారి జన్మించింది. దీంతో టీజీఎస్ ఆర్టీసీ పాపకు జీవిత కాల ఫ్రీ బస్ అందివ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న పాప, ఆమె కుటుంబ సభ్యులను కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ అధికారులు కలిశారు. చిన్నారికి జీవితకాలపు మిగతా 2లో

ముందడుగు
ఆదివారం, 23-6-2024, హైదరాబాద్

## పనిలో చంద్రబాబుతోనే పోటీ

మొదటిపేజీ తరువాయి

12 గంటలు పని చేస్తే చాలు అనుకునే వాడిని కానీ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి 18 గంటలు పని చేసే వ్యక్తిగా చంద్రబాబు గురించి చెప్పుకొచ్చారు. తనతో తమ అధికారులంతా అంతే ధీటుగా 18 గంటలు పని చేయాల్సిన అవసరం ఏర్పడిందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఇండియాలోనే ప్రగతి పథంలో ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. మూడోతరం లోకేష్, భరత్ రాజకీయాల్లో ఎలాంటి మార్క్ కనబరుస్తారో చూడాలని రేవంత్ వ్యాఖ్యానించారు. బసవతారకం సేవల విస్తరణ కోసం సహకారం కోరగానే రేవంత్ రెడ్డి అంగీకరించారని ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. దాతల సహకారంతో ఆస్పత్రి ఈ స్థాయికి చేరుకుందని చెప్పారు. సేవలను మరింత విస్తరించాలని అభిప్రాయపడ్డారు.

## అమర్‌నాథ్ గుహలో మొదటి పూజ పూర్తి

మొదటిపేజీ తరువాయి

తన అధికారిక పోస్ట్‌లో పోస్ట్ చేశారు. బాబా అమర్‌నాథ్ జీ ఆశీర్వాదం తీసుకొని ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, పురోగతి, శ్రేయస్సు కోసం ప్రార్థించారు. కాశ్మీర్ హిమాలయాలలో సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న గుహ దేవాలయానికి పవిత్ర యాత్ర ఎల్లప్పుడూ మత సామరస్యానికి చిహ్నంగా ఉందని.. యాత్రికులు గుహ ఆలయానికి చేరుకోవడానికి స్థానిక ముస్లిం‌లు సహాయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అమర్‌నాథ్ యాత్ర ఈ ఏడాది జూన్ 29 నుంచి యాత్ర ప్రారంభం కానుంది. 52 రోజుల పాటు సాగే ఈ యాత్ర ఆగస్టు 19న



రక్షాబంధన్, శ్రావణి పూర్ణిమతో ముగుస్తుంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ఇక్కడికి సందర్శిస్తుంటారు. మరో ప్రకటనలో.. "జమ్మూ కాశ్మీర్‌లో అన్ని వర్గాల ప్రజలు వారి మతంతో సంబంధం లేకుండా ఈ యాత్రలో పాల్గొనడం పురాతన సంప్రదాయం. దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికులను స్వాగతించడానికి, సేవ చేయడానికి పౌరులందరూ కలిసి రావాలని కోరుతున్నా. శ్రీ అమర్‌నాథ్ జీ పుణ్యక్షేత్రం బోర్డు, సంబంధిత శాఖల అధికారులు యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నారు. ప్రయాణం సాఫీగా, సురక్షితంగా మరియు అవాంతరాలు లేకుండా ఉండేలా మేము అన్ని చర్యలు తీసుకుంటున్నాము. భక్తులకు కావాల్సిన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, భద్రతను గణనీయంగా పెంచాం." అని పేర్కొన్నారు.

## నీట్ పరీక్ష రద్దు చేయకపోవడానికి కారణమిదే

మొదటిపేజీ తరువాయి

పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ సందర్భంగా ఎన్టీఏ నిర్ణయాలు మరిన్ని అనుమానాలు కలిగించాయి. అయినా నీట్ కౌన్సెలింగ్ ఆపేందుకు సుప్రీంకోర్టు కానీ, ఎన్టీఏ కానీ అంగీకరించడం లేదు.

ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. మరోవైపు నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ వ్యవహారంలో బీహార్ లో విచారణ జరుగుతోంది. అయినా నీట్ పరీక్ష రద్దు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై శనివారం కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరణ ఇచ్చారు. ఈ లీక్ పరిమిత సంఖ్యలో విద్యార్థులను మాత్రమే ప్రభావితం చేసిందని, గతంలో జరిగిన 2004, 2015 పరీక్షల్లో విస్తృతమైన లీక్‌లు పరీక్షలను రద్దు చేయడానికి దారితీసిన సంఘటనలకు భిన్నంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

నీట్ పరీక్షను రద్దు చేయడం వల్ల ఇందులో ఉత్తీర్ణత సాధించిన లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడుతుందని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఈ కేసును సుప్రీంకోర్టు విచారిస్తోందని, కోర్టు తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నీట్-యుజి పరీక్షలో 67 మంది విద్యార్థులు 720 మార్కులు సాధించిన తర్వాత వివాదం చెలరేగడంతో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణ జరుగుతోంది. అయితే సుప్రీంకోర్టు కూడా కౌన్సెలింగ్ ఆపొద్దని స్పష్టం చేయడంతో తుది నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

## చిన్నారికి జీవిత కాల ఫ్రీ బస్ పాస్ ఇచ్చిన ఆర్టీసీ

మొదటిపేజీ తరువాయి

ఉచిత బస్ పాస్‌ను అందించారు. బస్ పాస్ తో పాటు వారికి రూ.14 వేల ఆర్థిక సాయంతో పాటు వస్త్రాలను అందజేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. "కరీంనగర్ బస్ స్టేషన్ లో ఇటీవల పుట్టిన చిన్నారికి జీవితకాలపు ఉచిత బస్ పాస్‌ను #TGSRTC యాజమాన్యం అందజేసింది. స్థానిక ఆస్పత్రిలో కుటుంబసభ్యులను ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ అధికారుల బృందం శనివారం కలిసింది. ఆడపిల్లకు బస్ పాస్ తో పాటు వారికి రూ.14 వేల ఆర్థికసాయం, వస్త్రాలను అందజేసింది" అని ట్వీట్ చేశారు. "నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు వస్త్రాలను అందజేసి గొప్ప మనసు చాటుకున్న ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ అధికారుల బృందానికి అభినందనలు. పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని చూసి మానవత దృక్పథంతో స్పందించి కాన్పు చేసిన ఆర్టీసీ సిబ్బందికి మరోకసారి సంస్థ అభినందనలు తెలియజేస్తోంది. సమయస్ఫూర్తితో వ్యవహరించి సకాలంలో స్పందించిన మీ సేవా ఆదర్శనీయం" అని పేర్కొన్నారు.



## మహిళపై వీధి కుక్కల గుంపు దాడి

- అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడింది
- చిత్రపురి కాలనీలో జరిగిన ఘటన

ముందడుగు హైదరాబాద్: నడుచుకుంటూ వెళ్తోన్న ఓ మహిళపై వీధి కుక్కల గుంపు దాడికి దిగిన ఘటన హైదరాబాద్ నగర ప్రజలను భయాందోళనకు గురి చేసింది. వాటి దాడి నుంచి ఆ మహిళ అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడింది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఈ ఘటన జరిగింది. చిత్రపురి కాలనీలో నడుచుకుంటూ వెళ్తోన్న మహిళపై వీధికుక్కలు దాడికి యత్నించాయి. చుట్టుముట్టిన వీధి శునకాల బారి నుంచి తప్పించుకునేందుకు ఆ మహిళ గట్టిగా కేకలు వేసింది. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడిపోయినా కుక్కలను అదిలించే ప్రయత్నం చేసింది.

ఇంతలో ఓ ద్విచక్రవాహనదారుడు, కారు రావడంతో కుక్కలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఈ దృశ్యాలన్నీ సమీపంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. బాధిత మహిళ భర్త ఈ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి.. ఊర కుక్కలకు ఇంటి బయట అన్నం పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. "ఇంటి ముందు కుక్కలకు అన్నం పెడితే నా భార్యకు ఎదురైన పరిస్థితే మీకు కూడా రావొచ్చు" అంటూ పోస్టు చేసిన వీడియో వైరల్‌గా మారింది.

## తొలిసారి ప్రియాంక రాజకీయ అరంగేట్రం

### వయనాడ్ నుంచి లోక్‌సభకు పోటీ ▪ మమతా బెనర్జీ ప్రచారం చేసే అవకాశం

ముందడుగు జాతీయం: కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి రాజకీయ అరంగేట్రం చేయనున్నారని ఇటీవల కాంగ్రెస్ ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రియాంకకు మద్దతుగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వయనాడ్‌లో ప్రచారం చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తుండడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ, వయనాడ్‌లలో పోటీ చేసి రెండు స్థానాల్లోను భారీ మెజారిటీతో గెలుపొందారు. రెండు స్థానాల్లో గెలిచినవారు ఒక స్థానాన్ని వదులుకోవాలనే నియమం ప్రకారం ఆయన వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు.



దీంతో ఈ స్థానంలో ప్రియాంక పోటీకి దిగుతున్నారు. 2019 నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ప్రియాంక ఇప్పటివరకు ఏ స్థానంలోనూ పోటీ చేయలేదు. కాంగ్రెస్‌పై అభిమానం చూపుతున్న వయనాడ్‌లో ఆమె తొలిసారి పోటీ చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తారని హస్తం పార్టీ ధీమా వ్యక్తంచేస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పశ్చిమబెంగాల్‌లో సీట్ల పంపకంపై విభేదాల కారణంగా మమతా బెనర్జీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీలోకి దిగారు. అయితే, ఈ రెండు పార్టీలు జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో భాగంగా కలిసి పనిచేశాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం మమత మాట్లాడుతూ ఇండియా కూటమికి తృణమూల్ కాంగ్రెస్(TMC) బయటినుంచే మద్దతిస్తుందని పేర్కొన్నారు.

ముందడుగు
ఆదివారం,
23-6-2024,
హైదరాబాద్

# యూట్యూబ్‌లో సరికొత్త నిబంధనలు

## డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టేలా ముందడుగు



ముందడుగు జాతీయం: తమ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో వచ్చే డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టడటంలో భాగంగా యూట్యూబ్ ముందడుగువేసింది. కొందరు కంటెంట్ క్రియేటర్లు తమ ఫాలోవర్లను ఆకట్టుకోవడంలో భాగంగా లేనిది ఉన్నట్లుగా.. ఉన్నది లేనట్లుగా చూపిస్తున్నారు. దీంతో ఏది నిజమైన వీడియోనో.. ఏది ఏఐ సాయంతో రూపొందించిన వీడియోనో తెలుసుకోలేక తికమకపడుతున్నారు. వ్యక్తులకు తెలియకుండా వారి వాయిస్‌ను ఉపయోగించి కంటెంట్‌ను అందిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టేందుకు యూట్యూబ్ సరికొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోలో ఏఐని వినియోగిస్తుంటే ఆ విషయాన్ని యూజర్లకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. తాజాగా మరికొన్ని ఫీచర్లు జోడించింది. వీటి సాయంతో వినియోగదారులు డీప్‌ఫేక్ కంటెంట్‌పై రిపోర్ట్ చేయొచ్చు. ఇకపై యూట్యూబ్‌లో మీ ఫొటో లేదా వాయిస్‌ని ఉపయోగించి రూపొందించిన కంటెంట్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయొచ్చు. యూజర్ల అభ్యర్థన మేరకు ఆ వీడియోలను పరిశీలించి, కంటెంట్ వాస్తవానికి విరుద్ధంగా ఉందా? అనే విషయాన్ని ధ్రువీకరించి సదరు వీడియోలను తొలగిస్తుంది. దీంతో యూజర్ల డీప్‌ఫేక్ వీడియోలను అరికట్టొచ్చని పేర్కొంది. యూజర్ల గోప్యతను పెంచడంలో భాగంగానే వీటిని తీసుకొచ్చినట్లు తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది.

# ఎక్కువ పిల్లలుంటే.. జీవితాంతం ట్యాక్స్ బంద్

- జనాభాను పెంచుకునేందుకు వినూత్న ఆలోచన
- ఐరోపా దేశం హంగేరీ ప్రధాని ప్రకటన



ముందడుగు జాతీయం: ఐరోపా దేశం హంగేరీ జనాభాను పెంచుకునేందుకు ఆ దేశ ప్రభుత్వం వినూత్న ఆలోచనలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఎక్కువమంది సంతానం ఉన్నవారు జీవితాంతం ఆదాయపు పన్ను కట్టాల్సిన అవసరం లేదని స్వయంగా దేశ ప్రధానే ప్రకటించడం గమనార్హం. ఐరోపాలో జననాలు చాలా తక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో ఈ సమస్యకు వలసలు పరిష్కారంగా మారుతున్నాయి. జనాభాను పెంచుకునేందుకు వలసదారులను ఆహ్వానించాల్సి వస్తోంది. అందుకే మేం విభిన్న ఆలోచనలతో ముందుకొచ్చాం. కనీసం నలుగురు లేదా అంతకంటే ఎక్కువమందిని కనే మహిళలకు తమ జీవితకాలం వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు కల్పిస్తాం" అని హంగేరీ ప్రధాని విక్టోర్ ఆర్బన్ తాజాగా ఆసక్తికర ప్రకటన చేశారు. దీంతోపాటు పెద్ద కుటుంబాలు పెద్ద పెద్ద కార్లు కొనుగోలు చేసేందుకు వీలుగా సబ్సిడీని కూడా ఇవ్వనున్నట్లు హంగేరీ ప్రభుత్వం వెల్లడించింది. అంతేగాక, పిల్లల పెంపకం కోసం దేశవ్యాప్తంగా 21వేల క్రెచ్‌లను ప్రారంభించినట్లు తెలిపింది. ఇలాంటి మినహాయింపులతో పెళ్లిళ్లు, కుటుంబవ్యవస్థను ప్రోత్సహించినట్లవుతుందని అక్కడి సర్కారు అభిప్రాయపడుతోంది. హంగేరీ ప్రభుత్వం గతంలోనూ ఇలాంటి బంపరాఫర్లు ప్రకటించింది. పెళ్లిళ్లు, జననాల రేటును పెంచేందుకు 2019లో ఓ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దానికింద, 41ఏళ్లు రాకముందే పెళ్లి చేసుకునే అమ్మాయిలకు 10 మిలియన్ ఫోరింట్స్ (హంగేరీ కరెన్సీ) సబ్సిడీ రుణాలు కల్పించింది. పెళ్లయిన తర్వాత ఆ మహిళ ఇద్దరు పిల్లలకు జన్మనిస్తే రుణంలో మూడోవంతును మాఫీ చేస్తామని తెలిపింది. ఒకవేళ ముగ్గురు అంతకంటే ఎక్కువ సంతానం కలిగితే మొత్తం రుణాన్ని మాఫీ చేస్తామని ఆఫర్ ఇచ్చింది. ప్రస్తుతం హంగేరీ జనాభా 96.4లక్షలుగా ఉంది.

# ఉత్సాహంగా ప్రారంభమైన 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలు

## హజరైన మాజీ పోలీస్ చీఫ్ అంజనీ కుమార్



ముందడుగు హైదరాబాద్: 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలు శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఎస్‌ఎటీఎస్ షూటింగ్ రేంజ్‌లో ప్రారంభమయ్యాయి. వివిధ విభాగాలలో 200 మందికి పైగా పోటీదారుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ ఘనంగా ప్రారంభించారు. పోటీలలో 10M రైఫిల్/ఓపెన్ సైట్ రైఫిల్, 25M పిస్టల్, 50M పిస్టల్ మరియు 10M పిస్టల్ ఈవెంట్‌లు పాల్గొనేవారి అసాధారణ షూటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించాయి. తెలంగాణ రైఫిల్ షూటింగ్ పోటీలో షూటింగ్ నైపుణ్యాలను ప్రదర్శించిన తెలంగాణ మాజీ పోలీస్ చీఫ్ అంజనీ కుమార్ బహుమతులు అందజేశారు. 10వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ పోటీలలో మా షూటర్లు ఉత్సాహంగా పాల్గొనడం నిజంగా సంతోషాన్నిస్తుంది" అని మిస్టర్ అమిత్ సంఘీ అన్నారు. "క్రీడ పట్ల వారి అంకితభావం మరియు అభిరుచి ప్రశంసనీయం, రాబోయే రోజుల్లో మరిన్ని ఉత్తేజకరమైన సంఘటనలను చూడాలని మేము ఎదురుచూస్తున్నామని అన్నారు.



## ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు

ముందడుగు అమరావతి: ఏపీ 16వ అసెంబ్లీ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికను ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో అధికారికంగా ప్రకటించారు. స్పీకర్ పదవికి శుక్రవారం ఒకే నామినేషన్ దాఖలు కావడంతో బుచ్చయ్యచౌదరి ఎన్నిక ఏకగ్రీవమైంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనకు 40 ఏండ్లకుపైగా రాజకీయ అనుభవం ఉన్నది.

# కొనసీమ ఆహారనిధి ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి

## రైతులకు నూతన వస్త్రాలతో సత్కారం



ముందడుగు అమలాపురం: సమస్త మానవాళికి, ఆహారాన్ని అందించే రైతులను గౌరవించుకునే పండుగ ఏరువాక పూర్ణిమ. జేడి ఫౌండేషన్ మరియు కొనసీమ ఆహారనిధి ఆధ్వర్యంలో కోనసీమ ప్రాంతం, ఇరుసుమండ గ్రామం లో ఏరువాక పూర్ణిమ సందర్భంగా వీరంశెట్టి రామకృష్ణ పరమహంస వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అల్పాహార విందు ఏర్పాటు చేయడం అనంతరం పూజలు నిర్వహించి రైతులను సత్కరించి నూతన వస్త్రాలు మరియు స్వీట్స్ అందించి రైతు సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. గత 6 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం కోనసీమ ఆహారనిధి అధ్యక్షులు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ యాంత్రికంగా, కృత్రిమంగా ఎంత మార్పులు చోటు చేసుకున్నా రైతు స్థానం ఎవరూ పొందలేరు అన్నారు. ఈ కార్యక్రమంలో రంకిరెడ్డి కాశీ, విజయరావు, ఏడుకొండలు, మహేష్, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, సంస్థ ప్రతినిధులు వీరు గట్టెం బందరు సురేష్, రంకిరెడ్డి శ్రీనివాస్, కిరణ్ చీకట్ల, శివమణి పాల్గొన్నారు.

ముందడుగు
ఆదివారం, 23-6-2024, హైదరాబాద్

# మహిళపై కర్రతో విచక్షణారహితంగా దాడి

## ఆపకుండా సెల్‌ఫోన్లలో వీడియో తీసిన జనం

ముందడుగు మధ్యప్రదేశ్:

ఓ మహిళపై కొందరు వ్యక్తులు దారుణంగా దాడి చేశారు. అందరూ చూస్తుండగానే కర్రతో విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. మధ్యప్రదేశ్ ధార్ జిల్లాలోని తండా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మోదీ 3.0 కేబినెట్‌లో కేంద్ర మంత్రిగా నియమితులైన సావిత్రి ఠాకూర్ స్వగ్రామంలో ఈ ఘటన జరిగింది. మహిళను కొందరు వ్యక్తులు అందరూ చూస్తుండగానే కర్రతో దారుణంగా కొట్టారు. నలుగురు వ్యక్తులు మహిళను పట్టుకోగా.. ఓ వ్యక్తి బలమైన కర్రతో కొడుతూ కనిపించాడు. ఈ దాడిలో తనను కాపాడండి అంటూ ఆ మహిళ ఎంత వేడుకున్నా ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. పైగా ఈ దారుణాన్ని



తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ చోద్యం చూశారు. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోస్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియోపై పోలీసులు స్పందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. మహిళపై దాడి చేసిన ప్రధాన సూత్రధారి నర్సింగ్‌గా గుర్తించారు. అతను గంధ్వానీలో గల కోక్రికి చెందిన వాడని ధార్ జిల్లా ఎస్పీ మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు.

మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటనకు గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని ధార్ జిల్లా ఎస్పీ మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు.

# లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకాభిప్రాయంతో కాదా !!

- తొలిసారిగా స్పీకర్ ఎన్నిక జరుగనుందా ??
- సామాజిక విశ్లేషకులు కొన్నె దేవేందర్



ముందడుగు హైదరాబాద్:

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకాభిప్రాయంతోనే జరుగుతోంది. తాజా సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభలో బలం పెంచుకున్న విపక్ష పార్టీలు.. స్పీకర్ ఎన్నికపై కన్నేశాయి. తమకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వకుంటే.. స్పీకర్ ఎన్నిక నిర్వహించాలనే డిమాండును తెరమీదకు తెస్తున్నాయి. దీంతో దశాబ్దాలుగా ఏకాభిప్రాయంతోనే జరుగుతున్న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సంప్రదాయానికి తెర పడుతుందా? అనే చర్చ మొదలైంది. ఒకవేళ అదే జరిగితే.. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా స్పీకర్ ఎన్నికకు శ్రీకారం చుట్టినట్లవుతుంది.

స్వాతంత్ర్యానికి ముందు పార్లమెంటును సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీగా పేర్కొనేవారు. ఈ క్రమంలో 1925-1945 మధ్య కాలంలో ఆరుసార్లు స్పీకర్ల ఎన్నిక జరిగింది. విఠల్‌భాయ్ జే పటేల్ (రెండుసార్లు), మహమ్మద్ యాకూబ్, ఇబ్రహీం రహ్మతొల్లా, శణ్ముఖం శెట్టి, సర్ అబ్దుల్ రహీమ్, జీవీ మావలంకర్ ఈ జాబితాలో ఉన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ పరిషత్, తాత్కాలిక పార్లమెంటు స్పీకర్‌గా జీవీ మావలంకర్ కొనసాగారు.

స్వాతంత్ర్యానంతరం 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ, రాజ్యసభలు ఏర్పాటయ్యాయి. 1956లో మావలంకర్ మరణంతో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న అయ్యంగార్.. స్పీకర్ అయ్యారు. ఆ తర్వాత 1957లో రెండో సాధారణ ఎన్నికల తర్వాత కూడా స్పీకర్‌గా నియమితులయ్యారు. అలా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకాభిప్రాయంతోనే జరుగుతోంది. ఎంఏ అయ్యంగార్, జీఎస్ ధిల్లాన్, బలరాం జాఖడ్, జీఎంసీ బాలయోగి మాత్రమే రెండుసార్లు స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24 నుంచి ప్రారంభం కానున్నాయి. సభ్యుల ప్రమాణస్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉంటుంది. అయితే, తాజా ఎన్నికలో 233 స్థానాల్లో గెలుపొందిన విపక్ష 'ఇండియా' కూటమి.. డిప్యూటీ స్పీకర్ పదవి కావాలని డిమాండు చేస్తోంది. అదేవిధంగా స్పీకర్ పదవిని తీసుకోవాలంటూ.. సంకీర్ణ ప్రభుత్వంలోని భాజపా మిత్రపక్షాలకు సూచిస్తోంది. ఇందుకు మద్దతు కూడా ఇస్తామని ప్రకటిస్తోంది. ఈ క్రమంలో ప్రతిపక్ష నేతను ఉప సభాపతిగా అంగీకరించకుంటే స్పీకర్ పదవికి ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కాంగ్రెస్ అంటుంది

# మనిషికి అధిక కొలెస్ట్రాల్ ప్రాణాంతకమే

- ఏటా 44 లక్షల మంది మరణిస్తున్నారు
- శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్ చెక్ చేస్తూ ఉండాలి



ముందడుగు ప్రత్యేకం:

మనిషి శరీరం ఆరోగ్యంగా ఉండటానికి కొలెస్ట్రాల్ అవసరం, కానీ దాని స్థాయి పెరిగినప్పుడు, అది అనేక తీవ్రమైన సమస్యలకు కారణం అవుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే, అది గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రకారం, అధిక కొలెస్ట్రాల్ ప్రతి సంవత్సరం 4.4 మిలియన్ల మరణాలకు కారణమవుతుంది, ఇది మొత్తం మరణాలలో 7.8 శాతంగా ఉంది.

### ఆహారంలో ఉప్పు తగ్గించాలి

మీ ఆహారంలో ఉప్పు ఎక్కువగా వాడే వాటిని పూర్తిగా తగ్గించండి. మీ ఆహారంలో వీలైనంత ఎక్కువ పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఉపయోగించాలి. ఆహారంలో తక్కువ మాంసాన్ని ఉపయోగించాలి. ఎందుకంటే ఇందులో ఉండే కొవ్వు కొలెస్ట్రాల్ మొత్తాన్ని వేగంగా పెంచుతుంది. బదులుగా, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలను తినండి. అంతే కాకుండా బరువును అదుపులో ఉంచుకోవాలి. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రకారం, కొలెస్ట్రాల్‌ను నివారించడానికి, దానిని తగ్గించడానికి ధూమపానానికి దూరంగా ఉండాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలంటే ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని సంస్థ సలహా ఇస్తుంది. అంతే కాకుండా ఒత్తిడికి దూరంగా ఉండాలి. కొలెస్ట్రాల్‌ను తగ్గించడం కష్టమని మీరు ఆలోచిస్తూ ఉండవచ్చు, కానీ వాస్తవానికి ఇది మీ కొలెస్ట్రాల్‌ను తనిఖీ చేయడంతో ప్రారంభమవుతుంది. మీ శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్ ఎలా ఉందో చెక్ చేసుకుంటే ఆటోమేటిక్‌గా మీరే మారే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. లేకుంటే ఇబ్బందులు తప్పవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### కొలెస్ట్రాల్‌ను తగ్గించే ఔషధం

వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రకారం, స్టాటిన్స్ వంటి కొన్ని మందులు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో లేదా దాని నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. అయితే మీరు మీ జీవనశైలిని మెరుగుపరచడం ద్వారా కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గించవచ్చు. కొలెస్ట్రాల్ అదుపులో ఉండాలంటే ఖాళీ కడుపుతో ఈ పండ్లను తినండి. ముఖ్యంగా బరువు తగ్గించే బొప్పాయి, జామ, ఆపిల్, స్ట్రాబెరీ, ఆరెంజ్, అవకాడో వంటి పండ్లను తీసుకోవడం వల్ల పండ్లు చెడు కొలెస్ట్రాల్‌ను పెరగకుండా నియంత్రిస్తాయి. మన శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి కూడా పండ్లు ఎంతగానో దోహదం చేస్తాయి. పండ్లలో పుష్కలంగా ఉండే విటమిన్లు, మినరల్స్ మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. బరువు తగ్గాలి, శరీరంలో చెడు కొవ్వును తగ్గించుకోవాలి అని భావించే వారు కార్బోహైడ్రేట్లను ఆహారంలో తక్కువగా తీసుకోవాలి.


ముందడుగు
ఆదివారం,
23-6-2024,
హైదరాబాద్



# ఆమె పెళ్లికి వెళ్లాల్సిన బాధ్యత నాకుంది

సోనాక్షి సిన్హా , జహీర్ ఇక్బాల్‌ల పెళ్లి అంటూ అంటూ గతంలో వార్తలు వినిపించాయి. ఇప్పుడు నిజంగానే ఈ జంట ఒకటైపోతున్నారు. ఈ ఆదివారమే వీరి వివాహం జరుగనున్నదని తెలుస్తున్నది. ఇందులో బాగంగా వీరి ఇంట నిర్వహించిన మెహందీ వేడుక ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇందులో ఇరు కుటుంబాలకు చెందిన కొద్దిమంది అతిథులు మాత్రమే ఉన్నట్టు తెలుస్తున్నది. సోనాక్షి, ఇక్బాల్ కలిసి 'డబుల్ ఎక్స్‌ఎల్' సినిమాలో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఆ సినిమా సమయంలో ఇద్దరిమధ్య ఏర్పడ్డ స్నేహం ప్రేమగా మారింది. కొన్ని రోజుల క్రితం సోనాక్షి పెళ్లి టాపిక్‌ని ఆమె తండ్రి శత్రుఘ్నసిన్హా ముందు ప్రస్తావిస్తే.. 'వారి ప్రేమ, పెళ్లి గురించి నాకేమీ తెలీదు..' అని నిర్మొహమాటంగా సమాధానమిచ్చారు.
తాజాగా ఆ ప్రస్తావనే మరోసారి ఆయన ముందు తీసుకొస్తే.. 'ఇది నా కుమార్తె జీవితం. పెళ్లి ఆమె వ్యక్తిగతం. తండ్రిగా ఆమె పెళ్లికి వెళ్లాల్సిన బాధ్యత నాకుంది... తప్పకుండా వెళ్తా. నేనే తన బలం అని చాలా సందర్భాల్లో చెప్పింది తను. ఆమె అంటే నాకూ అమితమైన ప్రేమ. వెళ్లకుండా ఎలా ఉంటాను? అని సమాధానమిచ్చారు శతృఘ్నసిన్హా.


# భారీ రన్‌టైమ్‌తో భారతీయుడు-2



కొన్ని రోజులుగా సరైన విజయాలు లేక ఇబ్బందిపడ్డారు కమల్‌హాసన్. అయితే.. ప్రస్తుతం ఆయన టైమ్ నడుస్తున్నది. కమల్ 'విక్రమ్' సినిమా ఆరువందలకోట్ల వసూళ్లను రాబట్టి, ఆయన కెరీర్‌లోనే భారీ విజయంగా నిలిచింది. ఈ నెల 27న 'కల్కి 2898'తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు కమల్. ఇందులో ఆయన సుప్రీం యాస్కిన్‌గా ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా వేడి చల్లారకముందే.. 'ఇండియన్ 2'ని కూడా సిద్ధం చేసేశారు కమల్‌హాసన్. వచ్చేనెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తెలుగునాట భారతీయుడు2' పేరిట రిలీజ్ కానుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా గురించి ఓ తాజా వార్త వినిపిస్తున్నది. స్వతహాగా శంకర్ సినిమాలు కాస్త నిడివి ఎక్కువగా ఉంటాయి. 'ఇండియన్ 2' నిడివి ఇంకాస్త ఎక్కువని తెలుస్తున్నది. ఏకంగా 3 గంటల 10 నిమిషాల నిడివి వచ్చిందట ఈ సినిమా. అంతేకాదు, 'ఇండియన్2'కు సెన్సార్‌వారు ఏ సర్టిఫికెట్ ఇచ్చారట. ఇప్పటికే ఓవర్సీస్‌లో బుకింగ్స్ మొదలయ్యాయి. అక్కడ్నుంచి వచ్చిన సమాచారమే ఇది. కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో 'థగ్‌లైఫ్' అనే సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే.

# గొంతు సవరించిన విజయ్

రాజకీయ పార్టీని స్థాపించిన తమిళ స్టార్‌హీరో విజయ్, త్వరలో సినిమాలకు కూడా గుడ్‌బై చెప్పనున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాను నటిస్తున్న చివరి సినిమాగా 'The GOAT' సినిమాను ప్రకటించారాయన. 'The Greatest of all time' అనేది ఉపశీర్షిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రపై దేశవ్యాప్తంగా మంచి అంచనాలే ఉన్నాయి. ఇటీవల విడుదలైన ప్రచార చిత్రాలకు కూడా మంచి స్పందన వస్తున్నది. నేడు విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన పాటను మేకర్స్ విడుదల చేశారు.




ఈ మెలొడీ సాంగ్‌ని యువన్‌శంకర్‌రాజా, రాజా భవతారిణిలతో కలిసి విజయ్ కూడా ఆలపించడం విశేషం. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవ, మీనాక్షి చౌదరి మోహన్, జయరాం, స్నేహ, లైలా తదితరులు ఇతర పాత్రధారులు. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది.

# బీహార్‌లో కూలిన మరో వంతెన

## వారం రోజుల్లోనే కూలిన రెండు వంతెనలు

ముందడుగు బీహార్:
బీహార్ రాష్ట్రంలో వరుసగా వంతెనలు కూలిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఓ వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవకముందే తాజాగా మరో వంతెన కూలిపోయింది. సివాన్‌లోని దారుండా బ్లాక్‌లోని రామ్‌గర్హాలో గల గండక్ కాలువపై నిర్మించిన వంతెన కూలిపోయినట్లు అక్కడి అధికారులు తెలిపారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే, వారం వ్యవధిలోనే వరుసగా రెండు వంతెనలు కూలిపోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో రెండు రోజుల క్రితం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయిన విషయం తెలిసిందే. రూ.12 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనలో అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టలేదు. దీంతో ఈ వంతెనపై ప్రజా రవాణాకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. బక్రా నదిపై కుర్సా కంటా, స్కిటీ ప్రాంతాలను కలుపుతూ ఈ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి కూలడానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో కోసి నదిపై నిర్మిస్తున్న వంతెన కూలి పది మంది గాయపడిన విషయం తెలిసిందే.

